24-3-50

# లక్ష్మమ్మ ద్వయం

యం. ఆర్. ఏ. శోభనాచల వారి 'లక్ష్మమ్మ' చిత్రం గత నెల విడుదల యింది. ఈ చిత్రానికి దర్శకుడు గోపీచంద్. అసలు లక్ష్మమ్మ కథ చిత్రంగా తియ్యాలనే ఉద్దేశం, మొదట్లో గోపీచంద్ గారికే కలిగింది. అయన మహాతీ పిక్చర్సు అనే సంస్థను లేవదీసి అందులో లక్ష్మమ్మ పాత్రకు భానుమతిని బుక్ చేశారు. పరిస్థితులు సవ్యంగా నడిస్తే ఏనాడో మనం భానుమతి నటించిన లక్ష్మమ్మ చిత్రాన్ని చూసివుండే వాళ్ళం. కాని పరిస్థితులు మరోక లాగ రావటంచేత మహాతీ పిక్చర్సువారి లక్ష్మమ్మ రాలేదు.

గోపీచంద్ నిరాశ చెందకుండా, శోభనాచల వారి సహకారంతో యీ చిత్రాన్ని నిర్మించారు. దీనికి సినేరియో, మాటలు, దర్శకత్వం గోపీచంద్ వే.

లక్ష్మమ్మ చిత్రం ప్రారంభం, ముగింపు బాగున్నాయి. ఈ చరిత్రాత్మక జానపద చిత్రాన్ని బుర్రకథతో ప్రారంభించారు. లక్ష్మమ్మ విగ్రహందగ్గర బుర్రకథతో చిత్రం ప్రారంభించి అలాగే ముగింపుచేశారు. ఈ ఈవిధంగా ప్రారంభించి, ముగించటం కొత్త విషయం కాకపోయినా యిటువంటి కథకు యీ పద్ధతే మంచిది. ప్రతిభావారి శ్రీలక్ష్మమ్మ కథ ఉయ్యాల లూగడం, ఏదో వేడుక చేసుకోవడంతో ప్రారంభమయింది.

లక్ష్మమ్మ చిత్రంలో నారాయణరావు, లింగమూర్తి, గోవిందరాజుల సుబ్బారావులు బాగా నటించారు: వంగర వెంకటసుబ్బయ్య హాస్యం హుందాగావుంది. శివరావు 'మోత' పూతపదం కంటె, 'అదేమిట్రా నా తండ్రీ' అన్న వంగర పూతపదం బాగుంది. శోభనాచలవారి లక్ష్మమ్మలో మగవాళ్ళంతా బాగా నటించారు. ప్రతిభావారి శ్రీలక్ష్మమ్మ కథలో అంజలీదేవి, శేషమాంబ, జి. వరలక్ష్మి మొత్తం ఆడవాళ్లంతా బాగా నటించారు. ప్రతిభావారి చిత్రంలో వున్నంత అనవసర తీవ్రం, భారం శోభనాచల వారి చిత్రంలో లేదు.

గోపీచంద్ ఆధారపడిన లక్ష్మమ్మ కథ అసలు కథకు సన్నిహితంగా వున్నట్టు చరిస్తోంది. లక్ష్మమ్మ పెళ్ళి వేడుకలలో రాధనృత్యం ఏర్పాటు చెయ్యబడడం, పెళ్ళికూతురు ఎలాగా తన హక్కేగదా అని పెళ్ళికొడుకు రాధ మీద మరులుకొనడం సహజంగావుంది. తరువాత లక్ష్మమ్మ భర్త వెంకయ్యనాయుడు అలిగి లింగాపురం వెళ్ళిపోయినపుడు బావమరిది కోటయ్య ప్రాధేయపడి, బతిమిలాడి చివరకు భంగపోవటం సహజంగా వుంది. ప్రతిభావారి శ్రీలక్ష్మమ్మ కథలో తండ్రి ముసలప్పనాయుడు కొడుకు కోటయ్యతో కోపం తెచ్చుకోవద్దనీ, ఆవేశం లేకుండా వ్యవహారం పరిష్కారంచేసుకురమ్మంటే కోటయ్య మగపెళ్ళివారితో దెబ్బలాడి వస్తాడు. కోపిష్టిని ఆవేశం తెచ్చుకోవద్దనటం ఎంత అసందర్భంగా వుంటుందో, అలాటివాడిని వ్యవహారం పరిష్కారానికి కోపించడమూ అలాగేవుంది.

ప్రతిభావారి శ్రీలక్ష్మమ్మ కథలో గర్భాదానం గది, రంగసానిని తార్చడం, అక్కడి శృంగారం యివన్నీ ఎక్కువ విపులంగా తీసి చిత్రం పొడుగును అనవసరంగా పెంచారు. బహుశా యిది పాటకపు జనాన్ని రంజింపచెయ్యటానికి నిర్మాతలు పడిన బాధ అయివుంటుంది. శోభనాచలవారి లక్ష్మమ్మలో భూతవైద్యుడు చేసిన హంగామా, చివరి రంగంలో ఏడుపులు,తగ్గించినట్టయితే చిత్రంపొడవు తగ్గడమే కాక,యింకా రంజకంగా వుండేది. ఈచిత్రంలో మెచ్చుకోతగ్గ దేమిటంటే - నన్నివేశాల్లో వున్న సందిగ్ధావస్థ. ప్రేక్షకుడికి యికముందు ఏమి జరుగుతుందో అన్న సందిగ్ధావస్థ. నటులు తర్వాత జరుగబోయేది తమ చెప్పు చేతల్లో వున్నట్టుగా నటించలేదు. ప్రతిభావారి శ్రీ లక్ష్మమ్మ కథ గూడా యీ సస్పెన్స్ కలుగ చెయ్యటంలో



24-3-50

24-3-50

ఏమీ తీసిపోలేదు. అయితే నారాయణరావు సృష్టించిన సందిగ్ధావస్థ, నాగేశ్వర్రావు కల్పించలేదు. అందువల్ల శ్రీ లక్ష్మమ్మ కథలో సస్పెన్స్ తక్కువగా వున్నట్టు కనిపిస్తుంది.

మొత్తానికి రెండు చిత్రాలు విజయవంతమైన నిర్మాణమే. ఈ లక్ష్మమ్మ కథను ఇద్దరు నిర్మాతలు తయారు చెయ్యడంలో ఆరోగ్యకరమైన పోటీ కనిపిస్తుంది. నే నిదివరలో చెప్పినట్టుగా చిత్రాలు తక్కువ కాలంలో నిర్మింపబడడమే గాకుండా, సంఖ్య హెచ్చడమే గాకుండా, నాణ్యంకూడా హెచ్చుతుంది. ఈ కాశీ మజిలీ కథలన్నీ ఒక్కొక్క నిర్మాత చిత్రంగా తీసేకంటె, లక్ష్మమ్మ కథ వంటివి ఇద్దరేసి నిర్మాతలు పోటీ చిత్రాలుగా తీయడమే నయం. ఆ తప్పుకంటె యీతప్పు తక్కువది.

ఈ రోజుల్లో ఏ చిత్రానికైనా ప్రేక్షకులు తండోపతండాలుగా వస్తారు. ఒకే కథను ఇద్దరు నిర్మాతలు చిత్రాలుగా తీస్తే ఎవరో ఒకరు ఆర్థికంగా దెబ్బతింటారంటే, అలాగ, దెబ్బ తినకుండా, జాగ్రత్తగా ప్రజానురంజకంగా తీసే బాధ్యత ఆ నిర్మాతదే అయివుంటుంది. కాబట్టి చిత్రనిర్మాణంలో ఒకే కథను యిద్దరు నిర్మాతలు తీసుకున్నా, వేరువేరు కథా వస్తువులతో చిత్రాలు తీసినా ఒకరి నిర్మాణంకంటె మరొకరి నిర్మాణం ప్రజామోదంగా వుండటానికి ప్రయత్నించాలి, అప్పుడే మన చిత్రాలలో ఒక విశిష్టత ఏర్పడుతుంది. ఎక్కువ చిత్రాలు బాగుండడానికి అవకాశం ఏర్పడుతుంది.

సుబుద్ధి

# పిచ్చివాడి మరణం

దండమూడి మహీధర కుమార్

ఆతను వెళ్ళాడు. ఒక్కసారి ఆమె చకితురాలైంది. మూర్తివత్ చలన రహితంగా అతని మొహంలోకి చూస్తూ వుండిపోయింది. అతనో? అతనూ అంతే! భావాలన్నిటినీ కళ్ళల్లో నింపుకొని ఆమెవేపు అలాగే చూస్తున్నాడు. రెండు సంవత్సరాలు అయ్యాక మొదటిసారిగా కల్పించిన తన చిన్నప్పటి స్నేహితుణ్ణి 'మధూ! ఎప్పుడొచ్చావ్? బాగున్నావా?' అని అడగదే? అడగలేదు. ఆ శక్తి ఆమెలో నశించిపోయింది, ఒక్క గోపీకి మినహా మరెవ్వరికీ ఆమె హృదిలో స్థానంలేదు. అలాంటి స్థితిలో వచ్చిన మధును ఆమె ఏమని అడుగుతుంది, ఎలా అడుగుతుంది?

కనీసం అతనైనా 'శశీ! బావున్నావా?' అని అడగడేం? అడగలేదు. కాని ఏదో అడిగేందుకే వచ్చాడు. ఏమడగాలో అతనికి అర్థమవలేదు. అర్థం కాకపోటంవల్లనే అతను రెండు సంవత్సరాలు గడిచాక ఆమె పెళ్ళి గోపీతో అయ్యాక కూడా ఆమె ద్వారంముందు నిలబడ్డాడు. ఎంత ధైర్యం? ఆమెకు పెళ్ళయింది. భర్తతో వుంటోంది. అలాంటి ఆమెను ఏదో అడిగేందుకు రావటం అతని సాహసాన్ని వ్యక్తం చేస్తోంది.

కళ్ళు నేలను చూస్తున్నాయి. అన్నాడు—'శశీ! నాకు తెలుసు, నా ఉత్తరం నిన్ను బాధ పెట్టివుంటుంది. వాస్తవంగా నా అభిమతం నిన్ను ఏ రకంగానూ వ్యథను చెందేట్టు చేయటం కాదు. భాస్కరం ద్వారా నీవు పంపిన ఉత్తరం అలా ఎందుకు రాశావ్? చెప్పవే?'

ఆమె వెనుకటిలా చూస్తోంది. మాట్లాడలేదు. కనీసం ఒక్కమాటైనా అనదే?' లేదు మధూ! నేను నిన్ను మరచిపోలే' నని. పోనీ 'మధూ! నిన్ను నేను వెనుకటిలా ప్రేమిస్తున్నా' నని అనకూడదూ? అలా అనలేదు- ఆమెలో నుంచి దీర్ఘంగా ఒక శ్వాస ఆవిరిగా బయటికి వచ్చి గాలిలో కలిసిపోయింది. అన్నది—"మధూ! ఇక్కడికెందుకు వచ్చావ్? నేను సుఖంగా జీవిస్తున్నానేమో చూచి నాలో చిచ్చు రగిల్చి వెళ్లేందుకేనా?" మధు ఒకడుగు ముందుకేశాడు- 'లేదు శశీ! నాలో నీవు రగిలించిన చిచ్చును నీకెరుకపరిచేందుకు వచ్చాను. నీవు భాస్కరం



24-3-50